ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





టికెట్ మీకయితే వస్తాం..



లేకుంటే రాం రాం..!

"పులివెందుల నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్వీ సతీష్‌రెడ్డి పోటీ చేస్తే మనమందరం ఆయన అడుగుజాడల్లో నడుద్దాం.. ఆయన గెలుపు కోసం కృషి చేద్దాం.. అలా కాకుండా మీరంతా నా వెంట వైసీపీలోకి రావాలంటే మనమెట్ల పోవాలి? దశాబ్దాలుగా పసుపుజెండాను సైకిలును పట్టుకుని వైఎస్ కుటుంబానికి ఎదురొడ్డి పోరాడుతూ వచ్చాం. ఈ క్రమంలో విలువైన ఆస్తులను, పరువును పోగొట్టుకున్నాం. అది ఆయనకూ తెలుసు. ఆయన మళ్లీ సొంతగూడు తెలుగుదేశంలోకి వస్తాడనుకుంటే.. ఇప్పుడేంది మనలను మక్కెలిరగదన్ని జైల్లో పెట్టి తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టిన వైఎస్ కుటుంబంలోని ఓ వర్గానికి చెందిన వైసీపీలోకి రావాలంటూ కోరుతున్నారు. ఇది మాకు నచ్చడంలేదు" అంటూ పులివెందులకు చెందిన టీడీపీ నేతలు చర్చించుకోవడం జిల్లా రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.



వేంపల్లెలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ రెడ్డి (ఫైల్)

- వేరేవాళ్లకు టికెట్టయితే మనం పోవడమెందుకు
- వైఎస్ ఫ్యామిలీతో ఏళ్లుగా పోరాడుతున్నాం
- 2005 వేల్పుల ఘటనతో కేసులతో జైలుపాలయ్యాం
- నీవు మళ్లీ టీడీపీలోకి వస్తావనుకుంటే..
- వైసీపీలోకి వెళ్తావేంటన్నా..
- మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డికి టీడీపీ నేతల ఝలక్

(కడప-ఆంధ్రజ్యోతి): దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి ఆ కుటుంబానికి పులివెందుల అండగా ఉంటోంది. అదే సమయంలో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తరువాత అక్కడి జనం ప్రతి ఏటా ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేస్తూ వేస్తున్నారు. లింగాల, పులివెందుల, వేంపల్లె, చక్రాయపేట, సింహాద్రిపురం మండలాల్లో టీడీపీలో కూడా కరుడుగట్టిన పసుపు సైనికులు ఉన్నారు. అందుకే టీడీపీ ఆవిర్భావం తరువాత వైఎస్ ఫ్యామిలీ పులివెందులలో పెత్తనం కొనసాగిస్తున్నప్పటికీ ఓటర్లంతా వన్‌సైడే కాకుండా సైకిలు గుర్తుకు ఓటువేస్తూ వచ్చేవారు.

పులివెందులలో మొన్నటి వరకు టీడీపీకి ఎస్వీ సతీష్‌రెడ్డి నాయకుడిగా ఉండేవారు. ఆయనకు టీడీపీ కూడా సముచిత స్థానం ఇచ్చింది. 1999 నుంచి 2019 వరకు వరుసగా పులివెందుల నుంచి సతీష్‌రెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దించింది. అప్పట్లో సతీష్‌రెడ్డితో పాటు ప్రస్తుత ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, పేర్ల పార్థసారధితో పాటు కొందరు ముఖ్యులు ఉన్నప్పటికీ టీడీపీ సతీష్ రెడ్డికే ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. అంతేకాకుండా పులివెందులలో వైఎస్ కుటుంబాన్ని ఢీకొట్టాలన్న ఉద్దేశ్యంతో 2011లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2015లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి కట్టబెట్టి సతీష్‌రెడ్డికి అరుదైన గౌరవం ఇచ్చారు. 2014-19 చంద్రబాబు హయాంలో నీరు-చెట్టు ఇతరత్రా పనుల్లో సతీష్‌రెడ్డి శిబిరానికి కోట్లాది రూపాయల పనుల్లో ప్రాధాన్యత ఇచ్చారన్న ప్రచారం ఉంది.

2019లో వైసీపీ గెలుపుతో..

ఒక్క చాన్స్ అంటూ జగన్ జనాన్ని బతిమలాడాడు. జనం కూడా ఒకసారి చూద్దామంటూ జగన్‌కు అధికారమిచ్చారు. అయితే 2019లో టీడీపీ ఓటమి తరువాత సతీష్‌రెడ్డి పార్టీ ముఖ్య నేతలను విమర్శిస్తూ బయటికి వచ్చారు. వైసీపీ నుంచి పిలుపు రావడంతోనే టీడీపీపై విమర్శలు చేశారనే ప్రచారం కొనసాగింది. ఇవాళ, రేపు సతీష్ వైసీపీలో చేరతారంటూ అప్పటి నుంచి చర్చసాగింది. అయితే నాలుగేళ్ల తరువాత కూడా ఆయనకు వైసీపీ నుంచి పిలుపు రాలేదంటారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను ఇటీవల చంద్రబాబునాయుడు ప్రకటించారు. అందులో పులివెందుల నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. చంద్రబాబు అభ్యర్థుల ప్రకటన తరువాత జిల్లా వైసీపీ అధ్యక్షుడు సురేశ్‌బాబు, ఇతరులు సతీష్‌రెడ్డిని కలసి వైసీపీలోకి ఆహ్వానించారు. వెంటనే పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి సైతం సతీష్‌ను కలిసి టీడీపీలోకి ఆహ్వానించారు. మీ ఎన్నికల కోసం నేను నాలుగుసార్లు పనిచేశాను, ఈ సారి తనకోసం పనిచేయాలని కోరారు. కార్యకర్తల మీటింగ్ తరువాత ఏ విషయం చెబుతానని సతీష్‌రెడ్డి వెల్లడించారు. రెండురోజుల క్రితం కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ శ్రేణులందరికీ ఫోను చేశారు. సతీష్‌రెడ్డిని పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి కలవడంతో టీడీపీ శ్రేణులు ఆయన మీటింగ్‌కు వెళ్లారని చెబుతారు. అయితే సమావేశంలో సతీష్ రెడ్డి వైసీపీలోకి వెళ్లాలనే విధంగా మాట్లాడడం చూసి టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేదని చెబుతారు. వైఎస్ కుటుంబానికి వ్యతిరేకంగా పసుపు జెండా పట్టుకుని ఆస్తులు, ఇతరత్రా కేసులు భరిస్తూ ఆర్థికంగా నష్టపోయాం.. మళ్లీ ఆయన టీడీపీలోకి వస్తారనుకుంటే ఇప్పుడు వైసీపీలోకి నడవమంటున్నారు. ఇదెక్కడి న్యాయం అంటూ టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అప్పట్లో పలువురిపై కేసులు

పులివెందుల వైఎస్ కుటుంబానికి అండగా ఉంటోంది. అయితే వారి ఆగడాలు ఇతరత్రాలకు భరించలేక 1983 తరువాత ఆ నియోజకవర్గంలో కొందరు టీడీపీ వెంట నడుస్తున్నారు. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీకి గణనీయమైన ఓట్లే వస్తున్నాయి. 1999 నుంచి 2019 వరకు టీడీపీ తరఫున ఎస్వీ సతీష్‌రెడ్డే పోటీ చేస్తూ వస్తున్నారు. ఒక్క 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం బీటెక్ రవి పోటీ చేశారు. 2005లో వేల్పులలో సహకార ఎన్నికల సందర్భంగా జరిగిన కాల్పుల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పెద్దజూటూరుకు చెందిన రాఘవ, మాజీ మార్కెట్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురిపై కేసులు నమోదయ్యాయి. అయితే ఇప్పుడు సతీష్‌రెడ్డి కేసులు పెట్టిన జగన్ ఫ్యామిలీ పార్టీలోకే వెళతాననడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకోతున్నారు. వచ్చే ఎన్నికల్లో పులివెందుల వైసీసీ అభ్యర్థిగా సతీష్‌రెడ్డి పోటీ చేస్తే మీ వెంటే నడుస్తాం అని అంటున్నారు. అలా కాకుండా మనలను వేధించి జైలుపాలు చేసిన వారిని గెలిపించేందుకు మనం వైసీపీలో చేరడం ఎందుకు? మనలను వ్యతిరేకించిన పార్టీలోకి పోతామంటే మనం పోలేం అని చర్చించుకుంటున్నారు. ఇప్పుడీ వ్యవహారం వైసీపీలో హాట్‌టాపిక్‌గా మారింది.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- కేంద్రాల వద్ద 144 సెక్షన్

కడప(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వ 15, సోషల్ వెల్ఫేర్ 4, ఎయిడెడ్ 4, హైస్కూలు ప్లస్ 1, మోడల్ స్కూలు 1, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 44 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 29,942 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 16,177 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 13,765 మంది ఉన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులంతా ఉదయం 8గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని 8.30 నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులను కోరామని, అదే విధంగా పరీక్షకేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బందిని, తాగునీటిని అందుబాటులో ఉంచామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులను కోరనట్లు తెలిపారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. 69 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటర్‌బోర్డుకు అనుసంధానం చేసినట్లు తెలిపారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: రానున్న ఎన్నికల నిర్వహణలో మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఎంసీసీ టాస్క్‌ఫోర్సు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతలో భాగంగా ఎంసీసీ అమలుపై టాస్క్‌ఫోర్సు అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లాలో జరిగే ఎన్నికల విజయవంతానికి ఏవిధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుతం జరిగే ఎన్నికలను కూడా పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విధులను టాస్క్‌ఫోర్సు అధికారులు పక్కాగా అమలు చేయాలన్నారు. డబ్బులు పంచినా, తీసుకున్నా కేసులు నమోదు చేయవచ్చన్నారు. అలాగే లిక్కర్, చీరలు ఇతర కానుకల పంపిణీ జరగకుండా చూడాలన్నారు. పార్టీలకు సంబంధించిన లోగోలు, జెండాలు, బ్యానర్లు అనుమతి లేకుండా ప్రదర్శించడానికి వీలు లేదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రచార సమయం, పబ్లిసిటీ లౌడ్ స్పీకర్లకు అనుమతి ఇవ్వాలన్నారు. ఫెక్సీ ప్రింటర్స్ పేర్లు లేకుండా బ్యానర్లు ముద్రిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫొటోలను తొలగించాలన్నారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద ఎలాంటి రాజకీయ సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉంటుందని ప్రభుత్వ అధికారులందరూ నియమావళిని తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, టాస్క్‌ఫోర్సు అధికారులు ఎంసీసీ నిబంధనలు, విధివిధానాలపై క్షుణ్ణంగా వివరించారు. సమావేశంలో జడ్పీసీఈవో సుధాకర్‌రెడ్డి, ఎంసీసీ నోడల్ అధికారి నందన్, జిల్లా మాస్టర్ ట్రైనర్ మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ బిల్లుకంటే అదనంగా చెల్లించొద్దు : జేసీ

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: గ్యాస్ సిలిండర్ వినియోగదారులు బిల్లులో ఉన్న మొత్తం కంటే అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు గ్యాస్ డెలివరీ బాయ్స్, గ్యాస్ ఏజెన్సీల యజమానులు తమ గోదాము నుంచి డెలివరీ పాయింట్‌కు దూరంగా ఉన్నందున ట్రాన్స్‌పోర్టు చార్జీలు కూడా చెల్లించాలని వినియోగదారుల వద్ద అదనంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిల్లాలో కంపెనీల ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్‌కు అధిక ధరలు వసూలు చేయవద్దని ఆదేశాలు జారీచేశామని పేర్కొన్నారు. డెలివరీ బాయ్స్ బిల్లుకంటే అధికంగా వసూలు చేస్తే వెంటనే సేల్స్ ఆఫీసరు టోల్ ఫ్రీ నెంబరు 1967, 18002333555కు ఫిర్యాదు చేయాలని జేసీ సూచించారు.

కడపకు చేరుకున్న కంచి పీఠాధిపతి

కడప (కల్చరల్), ఫిబ్రవరి 29 : కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీస్వామి గురువారం ఉదయం 8.30 గంటలకు నగరంలోని చిన్మయ మిషన్ వారి లలితా పంచాయతన దేవాలయానికి విచ్చేశారు. వారికి భక్తులు, చిన్మయమిషన్ సభ్యులు, బ్రాహ్మణ సంఘాల వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చంద్రమౌలేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి త్రికాల పూజ నిర్వహించారు. సాయంత్రం 5గంటల నుంచి భక్తులకు ఆశీర్వాదం అందించారు. శుక్రవారం సువాసినీ పూజ, త్రికాల అభిషేక పూజతో పాటు ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు భక్తులకు



దర్శనం, ఆశీర్వాదం అందజేస్తారని చిన్మయ మిషన్ కడప అధ్యక్షుడు తురియానందస్వామి తెలిపారు.

మైదుకూరుకు 6న చంద్రబాబు రాక

కడప, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీన మైదుకూరుకు రానున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరుతో ఐదురోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా బహిరంగసభలు జరపనున్నారన్నారు. ఇందులో భాగంగా 6న ఉదయం నంద్యాలలో, మధ్యాహ్నం మైదుకూరులో నిర్వహించనున్నారని తెలిపారు. ఇక శంఖారావం పేరుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 10వ తేదీన కడపలో జరిగే సభకు హాజరుకానున్నారని వివరించారు.

తాడేపల్లి గూడెం సభను చూసి

తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది

- టీడీపీ నేతలు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఆర్.మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 29: తాడేపల్లి గూడెంలో జరిగిన టీడీపీ-జనసేన సభ చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి ఎంతో కీలకమన్నారు. టీడీపీ, జనసేన చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారం కోసం కాదని ఐదుకోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగునింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలందరూ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని విధ్వంసం చేశారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో డ్రైవరు సుబ్రమణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి ఆ మృతదేహాన్ని వారి ఇంటికి డోర్ డెలివరీ చేసిన విషయం గుర్తుచేశారు. అన్నక్యాంటీన్లను తెరిచి పేదలకు రూ.5తో భోజనం పెడితే ఈ వైసీపీ ప్రభుత్వం వాటిని మూయించిందన్నారు. కరోనా సమయంలో ఫేస్‌మాస్క్ అడిగినందుకు దళితవైద్యుడు సుధాకర్‌ను మానసిక వికలాంగుడుగా ముద్రవేసి చంపారని ఆరోపించారు. వైసీపీ వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెట్ ప్లేయరు హనుమవిహారి పారిపోయాడన్నారు. ఇవన్నీ జగన్‌రెడ్డి పెత్తందారు పోకడలకు నిదర్శనమని తెలిపారు. జాబ్‌క్యాలెండరు ప్రతియేటా ప్రకటిస్తామని చెప్పిన జగన్‌రెడ్డి ఎక్కడ ప్రకటించారని, అలాగే మెగా డీఎస్సీ ఎప్పుడు ప్రకటించారని ప్రశ్నించారు. పులివెందులలో జగన్‌రెడ్డి ఓటమి తప్పదని హెచ్చరించారు. ప్రజల ప్రయోజనాల కోసం సూపర్‌సిక్స్‌ను టీడీపీ, జనసేన ప్రవేశపెట్టిందన్నారు. ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. తాగునీరందించి రైతులను ఆదుకుంటామని యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, సుపరిపాలన ద్వారా సంపాదించిన సొమ్ము మరలా పేదలకు అందిస్తామని వారు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.



జడ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలోని జైభీమ్ రావు భారత్ పార్టీలో చేరుతున్న దస్తగిరి

న్యాయ సాధన సభకు తరలిరండి

- కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసి రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 29: తిరుపతిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న న్యాయ సాధన సభకు తరలిరావాలని ఆ పార్టీ మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన కడప నుంచి తిరుపతి వెళుతూ కలికిరిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి కీలుబొమ్మలుగా మారడం విచారకరమన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందని, ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం పంగనామాలు పెట్టడం శోచనీయమని చెప్పారు. కడపలో స్టీల్ ప్లాంటుకు స్వస్తి పలికారని, దుగరాజపట్నం ఓడరేవు ఊసే లేదని తెలిపారు. పదేళ్లయినా పోలవరం ప్రాజెక్టు ఇప్పటికీ ప్రశ్నార్థకంగా మిగిలిపోయిందన్నారు. విభజన చట్టంలో కాంగ్రెస్ ప్రతిపాదించిన ఏ ఒక్క దానిని బీజేపీ నెరవేర్చకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని తులసిరెడ్డి కోరారు. సమావేశంలో పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సోమశేఖర్ రెడ్డి, నాయకులు డాక్టర్ శ్రీవర్ధన్, బీఆర్ మల్లికార్జున, ఫయాజ్, రామకృష్ణారెడ్డి, శ్రీధర్, చిన్నికృష్ణ, శ్రీదేవి, సైదాబాను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చాంబర్‌లో చైర్‌పర్సన్..

కౌన్సిల్ అధ్యక్ష స్థానంలో వైస్‌చెర్మన్..!

- చైర్‌పర్సన్ సెలవులో ఉన్నారంటూ కౌన్సిల్లో ఎమ్మెల్యే ప్రకటన
- ప్రొద్దుటూరులో వైసీపీ రాజకీయ కుర్చీలాట

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 29: ప్రొద్దుటూరులో అధికార వైసీపీ కొత్త రాజకీయాలకు తెరలేపుతోంది. అసమ్మతివాదులను, అసంతృప్తులను బుజ్జగించడం కోసం మున్సిపాలిటీలో ఏకంగా రాజకీయ చదరంగం ఆడుతోంది. రాజ్యాంగబద్ధమైన చైర్మన్ పదవితో కుర్చీ లాట ఆడిస్తోంది. ఇందుకు గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశమే నిదర్శనం. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను తన చాంబర్‌కే పరిమితం చేసి వైస్‌చైర్మన్‌ను కౌన్సిల్ అధ్యక్షత స్థానంలో కూర్చోబెట్టడం విశేషం. వివరాలు ఇలా..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గురువారం చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమాశాన్ని ఏర్పాటు చేశారు. ఆ మేరకు సమాచారాన్ని కౌన్సిల్ సభ్యులకు, మీడియాకు అజెండాలో సంతకం పెట్టి మరీ చేరవేశారు. సమావేశం నిర్వహించేందుకు ఉదయం యధాతథంగా ఆమె మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఇంతలో ఏమి జరిగిందో ఏమో కానీ.. అనూహ్యంగా ఆమె మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి రాకుండా, అధ్యక్షత వహించకుండా తన చాంబర్‌లోనే ఉండిపోయారు. చైర్‌పర్సన్ సభకు రాకముందే ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వేదికపైన చైర్‌పర్సన్ సీటుకు పక్కన వేసిన తన సీటులో కూర్చున్నారు. దాదాపు అరగంట తర్వాత చైర్‌పర్సన్ సెలవులో ఉన్నారని ఎమ్మెల్యే కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. మొదటి వైస్‌చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజాను అధ్యక్షత వహించమని కోరారు. అయితే కింద ఫ్లోర్‌లోని తన చాంబర్‌లోనే చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ఉండగా.. ఆమె భర్త నాగరాజు కూడా కౌన్సిల్ హాల్లోకి వచ్చి కూర్చున్నారు. ఈ పరిణామంపై వైసీపీలోని అసంతృప్తి కౌన్సిలర్లతో పాటు తక్కినవారు గుసగుసలాడుకున్నారు. చైర్‌పర్సన్ సెలవులో ఉన్నారని చెప్పడం ఏమిటి.. ఆమె చాంబర్‌లోనే కూర్చోవడమేమిటని కౌన్సిలర్లు, ఉద్యోగులు విశేషంగా చర్చించుకున్నారు.



ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్ష స్థానంలో కూర్చున్న వైస్‌చైర్మన్ ఖాజా, ఆయన ఎదురుగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నేమ్‌ప్లేట్ అలాగే ఉన్న దృశ్యం

సరికొత్త సంప్రదాయం

మున్సిపల్ నిబంధనల ప్రకారం చైర్‌పర్సన్ సెలవులో ఉంటే వైస్ చైర్మన్ కౌన్సిల్ సభకు అధ్యక్షత వహించటం సర్వసాధారణం. చైర్‌పర్సన్ దీర్ఘకాలిక సెలవు పెడితే ఇన్‌చార్జ్ చైర్మన్‌గా వైస్‌చైర్మన్‌కు అవకాశం ఇవ్వచ్చు. ఆ మేరకు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా నియమించుకోవచ్చు. అలాంటిదేమీ లేకుండా.. గురువారం చైర్‌పర్సన్ తన చాంబర్‌లోనే ఉండి సభకు రాకపోవడం, సభకు వైస్‌చైర్మన్ అధ్యక్షత వహించటం ప్రొద్దుటూరు మున్సిపల్ రాజకీయాల్లో సకరికొత్త సంప్రదాయానికి తెరలేపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా.. మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియో సభ్యుడుగా మాత్రమే ఎమ్మెల్యేకు కౌన్సిల్లో అధికారం ఉందని, ఆయనే కౌన్సిల్ సమావేశాన్ని ప్రత్యక్షంగా నడిస్తుండటం చైర్‌పర్సన్‌కు ఉన్న అధికారాలను కబ్జాచేసి రాజ్యాంగపరమైన వారి హక్కులను కాలరాయడంగా పలువురు భావిస్తున్నారు.

అసమ్మతివాదులను బుజ్జగించేందుకు..?

ఇటీవల వైసీపీలో పెద్దనేతకు అసమ్మతి ఎక్కువై ఒక్కొక్కరుగా టీడీపీలో చేరుతున్నారు. ముస్లిం నేత, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా సైతం పెద్దనేతపై అసమ్మతి వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో బుజ్జగింపు చర్యల్లో భాగంగా ఈ ఒక్కరోజు కౌన్సిల్ సమావేశానికి ఆయనకు అధ్యక్షత వహించేందుకు అవకాశం కల్పించారని వైసీపీలోనే అంతర్గతంగా ప్రచారం సాగుతోంది. ముందు ముందు వైసీపీ పెద్దనేత తన రాజకీయ ప్రయోజనాలకోసం ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అని కౌన్సిల్ సభ్యులతో పాటు అందరూ ఉత్సుకతతో ఉన్నారు. ఇప్పటికే బీసీ మహిళ అయిన మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి కేవలం సంతకాలకు తప్ప ఆమెకు ఎలాంటి హక్కులు అధికారాలు లేవంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మూడేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు ఆమె తన చాంబర్‌లో అధికారులతో తానొక్కరే ఒక్క అధికారిక సమీక్షా సమావేశం కూడా నిర్వహించిన దాఖలాలు లేవని మున్సిపాలిటీలో చెబుతున్నారు. మున్సిపాలిటీలో వైసీపీ పెద్దనేత, ఆయన బావమరిదికి తప్ప అక్కడ ఇంకెవ్వరికి అధికారాలు లేవనేది బహిరంగంగా ప్రచారంలో ఉంది. గురువారం జరిగిన సంఘటన ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోంది.

ట్రాక్టరు ప్రమాదంలో రైతు మృతి


ప్రమాదంలో మృతి చెందిన లక్షుమయ్య

రాజుపాలెం, ఫిబ్రవరి 29 : మండల పరిధిలోని కొరపాడు గ్రామానికి చెందిన జల్లి లక్షుమయ్య (39) అనే రైతు ట్రాక్టరు ప్రమాదంలో మృతి చెందినట్లు రాజుపాలెం ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. మృతుడి భార్య రామలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయాన్నే తన పొలానికి ట్రాక్టరు పంపుసెట్టు ద్వారా నీరందించేందుకు వెళ్లాడు. పంపునకు పైపులు తొడుగుతున్న సమయంలో పక్కనే పంపుసెట్టు ఆడుతున్న ట్రాక్టరు పంపుసెట్టుకు మృతుడి లుంగీ చుట్టుకోవడంతో లక్షుమయ్య కూడా వేగంగా తిరగడంతో తలకు వెనుక భాగం తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వలంటీరు మృతి


బాబయ్య మృతదేహం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 29 : అనుమానాస్పద స్థితిలో బాబయ్య (25) అనే వలంటీరు మృతి చెందడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని క్రొరపాటిపల్లెలో బాబయ్య అనే వలంటీరు బుధవారం రాత్రి పొలం వద్ద విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. చుట్టుపక్కల వారు తెలపడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం పోరుమామిళ్లకు తరలించారు. కానీ అప్పటికే అతను మరణించినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. తమ కుమారుడి మరణంపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు హుస్సేనమ్మ, దాదాపీరయ్య అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గురువారం ఉదయం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేశారు. రిపోర్టులో వచ్చిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

భార్యను చంపిన కేసులో భర్త అరెస్ట్

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని ఒంటిమిట్టలో గత నెల 21వ తేదీ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన మహిళ కేసును గురువారం ఒంటిమిట్ట పోలీసులు ఛేదించారు. సీఐ పురుషోత్తంరాజు తెలిపిన వివరాల మేరకు... జనవరి 21వ తేదీ ఒంటిమిట్టలోని గంగమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న సుంకు సువాసిని (46) అనే మహిళ భర్త సుబ్బారావు ఇరువురు మొబైల్ క్యాంటీన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. భార్యాభర్తల మధ్య ఆరోజు రాత్రి గొడవ జరిగి తోసుకోవడంతో మహిళ తలకు బలమైన రక్తగాయమై మృతి చెందింది. వెంటనే ఎవరికీ అనుమానం రాకుండా వారి ఇంటి ఎదురుగా ఉన్న పాడుబడిన భవనం పక్కన భార్య మృతదేహానికి పెట్రోలు పోసి దహనం చేశాడు. నిందితుడు నేరం ఒప్పుకోవడంతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

దొంగతనం కేసులో ఐదుగురికి జైలు శిక్ష


జైలుశిక్ష పడ్డ ముద్దాయిలు

సంబేపల్లె, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామం కొత్తపల్లి బిడికి నాగారపమ్మ గుడిలో 10 నెలల క్రితం చోరీ కేసులో ఐదుగురు ముద్దాయిలకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల మేరకు... గత ఏడాది ఏప్రిల్ 4వ తేదీ దొంగతనం కేసులో కోడూరు చిన్న, పి.శ్రీను, సి.నాగరాజు, ఎస్.పెంచలయ్య, కె.గంగయ్యలపై అప్పట్లో కేసు నమోదైంది. విచారణ అనంతరం రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇషారత్ ఫాతిమా నిందితులకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. దొంగతనాలకు పాల్పడితే శిక్ష తప్పదని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 29: రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న డాక్టర్ మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. మైదుకూరు మండలం లెక్కల వారిపల్లికి చెందిన అంకిరెడ్డిపల్లి కొండారెడ్డి(37) రాజమహేంద్రవరం బొల్లినేని(కిమ్స్) ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. గత నెల 25వ తేదీ రాత్రి డ్యూటీ ముగించుకుని 26వ తేదీ ఉదయం బైక్‌పై దేవరపల్లిలోని బంధువుల ఇంటికి వెళుతూ బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కూలీల ఆకలి కేకలు

- రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదంటూ ఆవేదన
- కుటుంబం కోసం వలస వచ్చాం...
- కూలీ డబ్బులు అందక పస్తులు ఉంటున్నాం..
- పులివెందుల జగనన్న లేఅవుట్‌లో కూలీల దీనగాథ


తమ బిడ్డకు జ్వరం వస్తున్నా ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా డబ్బులులేవని చెబుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 29: వారంతా వలస కూలీలు. పొట్టచేతపట్టుకొని కూలీ పనుల కోసం దేశంలో ఎక్కడ పనులు జరుగుతుంటే.. అక్కడకు వెళ్లి పనులు చేసుకొని వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటూ ఉంటారు. ఇలాంటి కూలీలు పులివెందులకు వచ్చారు. పులివెందుల ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. కొందరు కాంట్రాక్టర్లు, మేస్త్రీలు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి కూలీలను పులివెందులకు రప్పించుకున్నారు. అలా వచ్చిన వీరిలో కొంత మంది పులివెందులలో నిర్మిస్తున్న జగనన్న మెగా హౌసింగ్ కాలనీలో పనులకు కుదిరారు. వీళ్లకు కాంట్రాక్టర్లు కూలీ డబ్బులు, జీతాలు బాగా ఇచ్చేవారు. కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకునేవారు. అప్పుడప్పుడు సొంత ఊళ్లకు వెళ్లి తల్లిదండ్రులను చూసుకొని, డబ్బులు ఇచ్చి తిరిగివచ్చి పనులు చేసుకునేవారు. అయితే అలాంటి కూలీలు ప్రస్తుతం ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. రెండు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం వస్తే ఆసుపత్రికి వెళ్లడానికి డబ్బులు లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల కడుపునింపి తాము పస్తులుంటున్నామని దీనంగా చెబుతున్నారు. కొంతమంది ఇప్పటికే వెళ్లిపోయారు, తమకు కూలీ డబ్బులు ఇస్తే తాము సొంత ఊళ్లకు వెళ్లిపోతామని చెబుతున్నారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న పులివెందుల జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లోని కూలీలు

రెండు నెలలుగా డబ్బులు ఇవ్వలేదు

తమకు రెండు నెలలుగా కూలీ డబ్బులు ఇవ్వలేదని మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలు తెలిపారు. గతంలో వారానికి ఒకసారి తిండి ఖర్చులకు మనిషికి రూ.1000 ఇచ్చేవారని, అది కూడా ఇప్పుడు ఇవ్వలేదన్నారు. చేతిలో డబ్బులు లేక పస్తులు పడుకుంటున్నామని, పిల్లలు ఆకలికి తట్టుకోలేక పోతున్నారని.. బిస్కెట్ ప్యాకెట్ కొని ఇచ్చి తాము ఖాళీ కడుపుతో పడుకుంటున్నామన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవడానికి ఇక్కడి నుంచి దాదాపు పది కిలోమీటర్లు వెళ్లి రావాలి. కాంట్రాక్టర్‌కు తెలియజేస్తే ఆయన ఫోన్ ఎత్తడంలేదు. రోగాల బారిన పడిన మాకు ఏదైనా జరిగితే మమ్మల్ని తీసుకెళ్లడానికి అంబులెన్స్ ఖర్చులు రూ.50వేలు అవుతాయన్నారు. పనులు నిలబెట్టినా కూడా కాంట్రాక్టర్ పట్టించుకోలేదన్నారు. అధికారులు తమ బాధను అర్థం చేసుకొని మాఊరికి పంపించాలని వారు కోరుతున్నారు. కాంట్రాక్టర్‌ను వివరణ అడిగేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పనులు నిలబెట్టిన విషయం వాస్తవమే..

జగనన్న మెగా హౌసింగ్ లేఅవుట్‌లో ప్రస్తుతం పనులు నిలబెట్టిన విషయం వాస్తవమే. ఇక్కడ 2500 వరకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు ఖచ్చితంగా వస్తాయి. అప్పటి వరకు పనులకు వచ్చిన కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంటుంది. రెండు నెలలుగా వారికి కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో పనులు నిలబెట్టాల్సిన పరిస్థితి. త్వరలో బిల్లుల చెల్లింపులు జరుగుతాయి. పనులు మళ్లీ మొదలవుతాయి.

- సంజీవరాయుడు, హౌసింగ్ ఏఈ, పులివెందుల

వైద్య కళాశాలలో ఘనంగా స్నాతకోత్సవం


పట్టాలు ప్రదానం చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 29 : కడప నగర పరధిలోని ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ అంజనేయప్రసాద్ ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజ రయ్యారు. ప్రభుత్వ వైద్యకళావాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, క్యాన్సర్ కేర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల సూపరింటెండెంట్ సురే శ్వర్ రెడ్డి, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, అడ్మినిస్ట్రేటివ్ వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ శారద, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌లు విద్యా ర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ కనిపించే దేవుడు వైద్యుడని.. వైద్యులు తమ వృత్తి పట్ల అంకితభావంతో నిబద్ధతతో ఉండాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, వైద్యులు, విద్యార్థులు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలిక అనుమానాస్పద మృతి ?

చిన్నమండెం, ఫిబ్రవరి 29: మండలంలోని కేశాపురం కస్పాకు చెందిన బాలిక నందిని (5) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిందని ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. గురువారం సాయంత్రం నందిని మరణించినట్లు సమాచారం అందిందడంతో రాయచోటి డీఎస్పీ మహమ్మద్‌బాషా, రాయచోటి రూరల్ సీఐ తులసిరామ్‌తో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లామన్నారు. బాలిక మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆర్ఎంకు ఆర్టీసీ ఎండీ ప్రశంసలు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 29: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో మాసోత్సవాలను పురస్కరించుకుని 2023 అక్టోబరు 26 నుంచి నవంబరు 25వ తేదీ వరకు కార్గో కడప రీజియన్‌లో అత్యధికంగా 14,765 డోర్ డెలివరీ బుక్ చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కార్గో ద్వారా సుమారు 9.08 కోట్ల రూపాయల ఆదాయం సంపాదించి కడప జోన్‌లో ప్రథమస్థానం సాధించింది. దీంతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్పందించి కడప రీజియన్ మేనేజరు ఎస్.గోపాల్ రెడ్డిని విజయవాడలోని తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఆర్టీసీ కడప జోన్ ఇంతటి ఆదాయానికి కారకులైన కార్గో సిబ్బంది, ఆయా డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఏటీఎంలకు, ఆర్టీసీ సిబ్బందికి కడప రీజియన్ మేనేజరు గోపాల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

వేంపల్లె, ఫిబ్రవరి 29: కేరళ రాష్ట్రం కొట్టాయం, ఎంజీయూలో మార్చిలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పాల్గొననున్నట్లు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త తెలిపారు.

ఫిబ్రవరి 28వ తేదీ ఆర్కేవ్యాలీలో యూనివర్సిటీ అంతర్ విశ్వవిద్యాలయాల జట్ల ఎంపికలు జరిగాయన్నారు. హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడాంశాల్లో ఎంపికలు జరగ్గా నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం జట్లు పాల్గొన్నాయన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 29 : పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు. గురువారం ఎంఈవో కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ-1 పాలెం నారాయణతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మండలం ముందంజలో ఉండాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బైజూస్ ట్యాబ్స్ నిర్వహణ వంటి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ ఇర్షాద్ అహ్మద్, సీఆర్పీ ఆదిమూలం శంకర్, రాజు, పెంచలయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.



గుక్కెడు నీరివ్వండి...!

- గొంతెండిపోతున్న పల్లెలు
- మంచినీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు
- ఎండిపోయిన మంచినీటి పథకం బోర్లు
- స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం


లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 29: పల్లెల్లో గొంతెండిపోతోంది. మంచినీటి బోర్లు ఎండిపోయి వ్యవసాయ బోర్ల వద్దకు ప్రజలు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయ బోర్ల రైతులు వారి పొలాలకు నీరు సరిపోలేదని, పంటలు ఎండుతున్నాయని అక్కడికి రావద్దని చెబుతున్నారు. దీంతో పల్లెవాసుల తాగునీటి కష్టాలు దేవుడికే ఎరుక. గుక్కెడు మంచినీరు అందించండి అని స్పందనలో ఎన్ని అర్జీలు ఇచ్చినా మా సమస్యల గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీల్లో నిధులు లేవని సర్పంచ్‌లు చేతులెత్తేయగా, కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేయమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పందిళ్లపల్లె, జె.వడ్డెపల్లె, సోములవాండ్లపల్లె, అప్పలరాజుగారిపల్లె, దళితవాడ గ్రామాల్లో తాగునీటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జె.వడ్డెపల్లెలో 200 కుటుంబాలు వారు నివసిస్తున్నారు. అందరూ వ్యవసాయ కూలీలే. ఈ గ్రామంలో గతంలో నాలుగు మంచినీటి పథకం బోర్లు వేశారు. ప్రస్తుతం నాలుగు బోర్లు ఎండిపోయాయి. అందులో ఒక బోరులో సన్నగా గంటకు ఒక బిందెడు నీరు వస్తున్నాయని, తెల్లవారగానే కూలికి వెళ్లకుండా సన్నగా నీరు వస్తున్న మంచినీటి బోరు వద్ద బిందెలు వరసలో పెట్టుకుని తమ వంతు వచ్చినప్పుడు గంట అక్కడే ఉండి బిందెడు నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

గుక్కెడు మంచినీటి కోసం గొడవలు కూడా జరుగుతున్నాయని మహిళలు తెలిపారు. ఏడాదిలో రెండు మంచినీటి బోర్లు 350 అడుగులు వేసినా చుక్కనీరు పడలేదని గ్రామస్తులు తెలిపారు. జె.వడ్డెపల్లెలో 3 వేలకు పైగా పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నాయని పశువులకు, మేకలకు, గొర్రెలకు నీరు లేక జీవాలను విక్రయిస్తున్నట్లు వెంకటరమణ, సాలమ్మ, చిన్న రామయ్య తెలిపారు. పందిళ్లపల్లె గ్రామానికి (జేజేఎం) జల్ జీవన్ పథకం కింద రూ.40 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎస్ఈ, ఏఈలు స్వయంగా గ్రామానికి వచ్చి మా అగసాట్లు కళ్లారా చూసి వెళ్లారని అయినా ఫలితం లేదని, ఆ నిధులు ఏమయ్యాయో తెలియడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేవారని, వాటికి బిల్లులు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా నిలిపివేశారని వారు తెలిపారు. బోర్లు వేయాలంటే పంచాయతీలో నిధులు లేవని ఆర్‌డబ్లుఎస్ అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని సర్పంచు అంటున్నాడని గ్రామస్తులు అంటున్నారు. ఇటీవల రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులు లక్ష రూపాయాలు వెచ్చించి బోరు వేయించాడని అయినా బోరులో నీరు పడలేదన్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని లేని పక్షంలో ఊరు ఖాళీ చేసి వేరే ఊరికి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మంచినీటి బోరు నుంచి వస్తున్న అరకొర నీరు

అదే పంచాయతీలోని సోములవాండ్లపల్లెలో నీటిలో ఫ్లోరైడ్ ఉందని అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని, కనీసం పశువులకైనా ఊరిలో ఉన్న మంచినీటి బోరు నీరును ఉపయోగించుకుందాం అనుకుంటే ఆ బోరు చెడిపోయి రెండు నెలలు కావస్తోందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని సోములవాండ్లపల్లె వాసులు తెలిపారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ప్రస్తుతం అరకొర నీరు బోర్ల నుంచి వస్తున్నాయని మార్చి నెల వచ్చేసరికి బోర్లలో ఉన్న నీరు అడుగంటిపోతాయని, మంచినీటి పథకం బోర్లను రీబోర్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీరు సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.




వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న వృద్ధురాలు, నీరు పడక వృథాగా ఉన్న బోరు, వ్యవసాయ బోరు వద్ద వేచి ఉన్న మహిళ

రూ.90 లక్షలు మంజూరయ్యాయి

తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం 90 లక్షల రూపాయలు మంజూరు చేసింది. టెండర్లు పిలిచి సమస్య ఉన్న గ్రామాల్లో మంచినీటి బోర్లు వేయిస్తాం. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. జె.వడ్డెపల్లెలో ఇప్పటికే రెండు బోర్లు వేశాం. అయినాఆ నీరు పడలేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. జె.వడ్డెపల్లెకు మాత్రం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

- కిశోర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఎవరూ పట్టించుకోలేదు

మా గ్రామంలో 200 కుటుంబాలు ఉన్నాయి నాలుగు మంచినీటి బోర్లు ఉండేవి అన్నిటిలోను నీరు ఎండిపోయి ఒక బోరులో మాత్రం చుక్కచుక్క నీరు వస్తోంది. గంటల తరబడి వేచి ఉంటే గాని గుక్కెడు మంచినీరు దొరకడం లేదు. ఎవరైనా పొలాలకు నీరు వదిలితే అక్కడికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ బోర్లు మాకు ఆధారం. ఆ బోర్లల్లో నీరు తగ్గిపోవడంతో వారు కూడా బోర్ల వద్దకు రావద్దంటున్నారు. అధికారులు మా సమస్యను పట్టించుకుని వెంటనే తీర్చాలి.

- పశువుల నాగసుబ్బమ్మ, జె.వడ్డెపల్లె

ట్యాంకర్ల ద్వారా నీరిమ్మని అడిగినా పట్టించుకోలేదు

ఊరిలోని బోర్లు ఎండిపోయి ఏడాది కావస్తున్నా నీరో రామచంద్రా అంటూ అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదు. రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాగోడు చూడలేక లక్ష రూపాయలు పెట్టి బోరు వేయించారు. అయినా అందులో నీరు పడలేదు. ట్యాంకర్ల ద్వారా నీటిని అందించండని అధికారులను సర్పంచు అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామస్తులందరూ కలిసి స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.

- తమ్మిశెట్టి రవణమ్మ, జె.వడ్డెపల్లె

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : పుత్తా

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 29: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. గురువారం నగర పంచాయతీ పరిధిలోని పడమటి వీధి, శివాలయం వీధి, కోటవీధి, రాంనగర్ తదితర ప్రాంతాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలకులు కమలాపురంలో జనాభా తక్కువగా ఉన్నా నగర పంచాయతీగా మార్చి ప్రజలను ఉపాధి పనులకు దూరం చేశారన్నారు. నగర పంచాయతీ చేయడం వల్ల ప్రతి సంవత్సరం రెండుసార్లు పన్నులు చెల్లించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవ రెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బా రెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, శ్రీకాంత్, సూరిబాబు, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 29: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె పంచాయతీలో గురువారం 25 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. పార్టీలోకి చేరిన వారికి పుత్తా నరసింహారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాలకు పథకాలు అందాలంటే అది చంద్రబాబు ముఖ్య మంత్రి అయితేనే సాధ్యమని గుర్తించి ఎంతోమంది వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచు, మాజీ పొలతల చైర్మన్ ఎర్రగుడి కొండారెడ్డి, ఎర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి, ఎర్రగుడి రాజగోపాల్‌రెడ్డి, ఎర్రగుడి రత్నమ్మలతో పాటు పలు కుటుంబాలు పార్టీలో చేరా యి. టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, పొలతల మాజీ చైర్మన్ విశ్వ నాథరెడ్డి, శంకర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు సింగపూర్ రాజారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్య దర్శి చంద్రబాబురెడ్డి, చినరాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 29: ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కళాజాత బృందం సభ్యు లు ప్రదర్శన ఇచ్చారు. గురువారం పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్, పార్నపల్లె బస్టాండ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికి త్సలపై పాటలు, నాటిక, నృత్య రూపాలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఎస్‌టీడీ కౌన్సిలర్ బాదల్ వలి, సీడీఎస్ మేనేజర్ టోపీవలి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటును తప్పక వినియోగించుకోవాలి



మారెళ్లమడకలో అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చక్రాయపేట, ఫిబ్రవరి 29: ఓటు హక్కు కలిగిన వారు తమ ఓటును తప్పక వినియోగించుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త సూచించారు. గురువారం మండలంలోని మారెళ్ల మడక గ్రామంలో ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-9 బృందం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్లకార్డు లతో ర్యాలీ చేపట్టి ఓటు హక్కు వినియోగం, ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సర్పంచు నరసింహులు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలు, ధ్యానంపై ఉచిత శిక్షణ

సింహాద్రిపురం, ఫిబ్రవరి 29: భగవద్గీత శ్లోకాలు, ధ్యానంపై 8 నుంచి 15 సంవత్సరాల బాల, బాలికలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు భాగవత భక్త సమాజ మండలి మీడియా ఇన్‌చార్జ్ బాలకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సింహాద్రిపురం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మార్చి 3వ తేదీ ఆదివారం నుంచి ప్రతి నెల ప్రతి ఆదివారం, అలాగే రెండో శనివారం ఉదయం 9-00 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణా కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9441502304 సెల్ నెంబరుకు సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, అలాగే పెండింగులో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, దేశ వ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కడప కలెకరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ 2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వివిధ పథకాలు అమలులో ఉన్నా యన్నారు. జగన్ అధికారంలోకి రాగానే నవరత్నాల పేరుతో అవన్నీ తొలగించేసి కార్మికులను మోసం చేశాడన్నారు. ఇసుక పాలసీ అంటూ ఇసుక వ్యాపారం మొదలుపెట్టి ఇసుక కొరత సృష్టించాడన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఆకలి చావులకు, అప్పులకు కారకుడయ్యారన్నారు. సంక్షేమ బోర్డుపై కన్ను పడి బోర్డులోని నిధులను విడతల వారీగా రూ.16వందల కోట్లు తీసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నవరత్నాలకు ఆ నిధులను వాడుకున్నారన్నారు. బోర్డులోని సభ్యులకు క్లెయిమ్‌లు చెల్లించకుండా కార్మికులను తిప్పలు పెడుతున్నారన్నారు. ఇప్పటి వరకు 40వేల వరకు క్లెయిమ్‌లు పెం డింగులో ఉన్నా ఇంత వరకు ఏ ఒక్కరికీ నయాపైసా చెల్లించ లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు పనిలో ఉండగా కింద పడి దెబ్బలు తగలడమో లేక మృతి చెందినా, ఆసుపత్రి పాలైనా కూడా పట్టించుకునే నాధుడు లేడన్నారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా డిప్యూటీ సెక్రటరీ శ్రీరాములు, జిల్లా ఆఫీస్ బేరర్స్ పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


డిక్లరేషన్ అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డిలు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 29: టీడీపీ, జనసేన రూపొం దించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం కడప నగరం కాగితాల పెంట కింగ్ ప్యాలెస్ ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లకు శంఖారావం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో అందరూ సైనికుల్లా పనిచేసి టీడీపీ విజయానకి కృషి చేయాలన్నారు. టీడీపీ అధినేత సూచనల మేరకు ప్రజల్లోకి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంటికీ చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరించాలని కోరారు. అనంతరం డిక్లరేషన్‌ను నాయకులు, కార్యకర్తలకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి, జిలానీబాషతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలకు ప్రభుత్వ మద్దతు ధర

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 29: రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రైతులు రబీ 2023-24 సంవత్సరంలో రైతులు సాగు చేసిన మినుములు, వేరుశనగ, బుడ్డశెనగ, పెసర పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలి పారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మినుము మద్దతు ధర రూ.6950, వేరుశనగ 6377, శనగ 5440, పెసర రూ.8558లతో కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలు మద్దతు ధరకు అమ్మడానికి రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఓటు వజ్రాయుధం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 29: సరైన పాలకులను ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధంలా ఉపయోగపడుతుందని ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెండ్లిమర్రిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు అనే హక్కుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడే నాయకులను ఎన్నుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చెంద్రాయుడు, హరిప్రసాద్, రమ్యజ్యోతి, నిఖిలప్రియ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి వినతుల వెల్లువ

వేంపల్లె, ఫిబ్రవరి 29: కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ప్రజల సమస్యలపై వినతులు వెల్లువలా వచ్చాయి. వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీ, కుమ్మరవీధి, వైఎస్సార్ గెస్ట్‌హౌస్ ప్రాంతాలలో పలు కుటుంబాలు గురువారం వైసీపీలో చేరాయి. కండువా వేసి ఎంపీ ఆహ్వానించారు. అన్నిచోట్ల సమస్యలను ఎంపీకి విన్నవించారు. పరిష్కారం చూపుతానని ఆయన హామీ ఇచ్చారు. జడ్పీటీసీ సభ్యులు రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచు శ్రీను, ఎంపీపీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మంచి వ్యక్తిత్వం జీవితాన్ని పరిమళింపజేస్తుంది

● కలెక్టర్ విజయరామరాజు


వెంకటరమణను సన్మానిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేష్‌కుమార్‌లు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: మంచి వ్యక్తిత్వం, విధి నిర్వహణలో మచ్చలేని సేవలు ఉద్యోగి జీవితాన్ని పరిమళింపజేస్తాయని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న (తహశీల్దారు) గుంటి వెంకటరమణకు జిల్లా రెవెన్యూ పరిపాలన విభాగం అధికారులు నిర్వహించిన పదవీ విరమణ ఆత్మీయ సభకు కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల జీవితంలోకి తొంగి చూసినపుడే వారి స్థితిగతులు, సాధకబాధలు తెలుస్తాయన్నారు. 37ఏళ్ల పాటు వెంకటరమణ వివిధ స్థాయిలో విధులు నిర్వహించి అధికారులు, ప్రజల మన్ననలు పొందడం అభినందనీయం అన్నారు. వెంకటరమణ శేష జీవితం ఆనందంగా సాగాలన్నారు. డీఆర్వో, రఘునాద్, కలెక్ట రేట్ ఏవో విజయకుమార్, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు వెంకటరమణను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

ఘనంగా పదవీ విరమణ సన్మాన కార్యక్రమం



హెచ్‌ఎంను ఆమె భర్తను సత్కరిస్తున్న బిషప్, సతీమణి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 29: సీఎస్‌ఐ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు పీసీ సుదేవి సుహవానా గురువారం పదవీ విరమణ చేశారు. కార్యక్రమానికి రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ పి.ఐజాక్ వరప్రసాద్ ఆయన సతీమణి భారతి హాజరై ప్రధానోపాధ్యాయురాలును అభినందించి ప్రశంసించారు. ఎంఈవో పాలెం నారాయణ మాట్లా డుతూ సుదేవి 44 సంవత్సరాలు తన వృత్తిలో చక్కగా పనిచేసి విద్యార్థుల ఉన్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పి.మనోహర్‌బాబు మాట్లాడుతూ సుదేవి సుహవానా గురించి వివరించారు. కార్యక్రమంలో ఆమె భర్త రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మునిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు పుల్లన్న సేవలు మరువలేనివి


పుల్లన్నను సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

సికెదిన్నె, ఫిబ్రవరి 29: పుల్లన్న వృత్తినే దైవంగా భావించి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన మహోన్నతుడు అని కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ తెలిపారు. పుల్లన్న ఉపాధ్యాయ వృతిని ఎంతో ఉన్నతంగా భావించి అంకిత భావంతో పనిచేసి సహోపాధ్యాయుల మన్ననలు పొంది, తోటి ఉపాధ్యాయుల మన్ననలు పొంది పాఠశాలను సైతం అందంగా తీర్చిదిద్దాడని, అటువంటి పుల్లన్న ఈ రోజు పదవీ విరమణ చేయడం ఎంతో బాధాకరంగా ఉందని, వారి శేష జీవితం భార్యాపిల్లలతో, బంధుమిత్రులతో ఆనందంగా గడపాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, పాల్గొన్నారు.

జన ఔషధి ప్రజలకు వరం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 29: జన ఔషధి ప్రజలకు వరంలాంటిదని డీసీఓ సుభాషిణి అన్నారు. గురువారం మండలంలోని వెల్లటూరు వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో జన ఔషధిని ప్రారంభించారు. డీసీఓ సుభాషిణి, డీసీసీబీ సీఈఓ రాజేంద్రకుమార్, సబ్‌డివిజన్ అధికారి సత్యానదం, వెల్లటూరు సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, జీఎం రాజామని, మేనేజర్ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణ నాగయ్య భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 29: స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్ణ నాగయ్య భూమిని కబ్జా చేసిన వారిని, అందుకు సహకరించిన వారిపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తొలుత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట.... తదుపరి కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ ఆంజనేయులు, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ, ప్రైవేటు అనే స్థలాలను ఎక్కడ పడితే అక్కడ ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తూ, అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, కడప కోటిరెడ్డి సమకాలీకుడైన స్వర్ణ నాగయ్య భూమిని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. 1952లో నాటి ప్రభుత్వం స్వర్ణ నాగయ్యకు నగర గూడూరు గ్రామ సర్వేనెంబర్ 59-బి1, బి2 నెంబర్లలో కేటాయించిన 5 ఎకరాల భూమిని కబ్జా చేయడం దుర్మార్గమన్నారు. అలాగే నగరం లోని చిన్నచౌక్, పుట్లంపల్లె, మామిళ్ళపల్లె, ఊటుకూరు, గూడూ రు, తదితర ప్రాంతాలలో ఎక్కువగా భూ మాఫియా రాజ్యమేలు తోందని ఆరోపించారు. జిల్లా రిజి స్ట్రార్ కార్యాలయ అధికారులు ఒక టీంగా ఏర్పడి వందలాది ఎకరాల భూములకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని ధ్వజమెత్తారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీఎస్టీ హ్యూమన్‌రైట్స్ నాయకులు జేవీ రమణ, న్యాయవాది అమీన్‌పీరా, దేవర శ్రీకృష్ణ, కైపు రామాజంజనేయులు, శివారెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ ఎన్నికలపై సమగ్ర విచారణ చేపట్టాలి


పాఠశాల విద్యశాఖ డైరెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 29: భారత స్కౌట్ ఎన్నికలపై సమగ్ర విచారణ చేప ట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, జె.శివారెడ్డి, జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ స్కూలు ఎడ్యుకేషన్ బోర్డులో పాఠశాల విద్యా డైరెక్టరు పార్వతిని కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఆర్జేడీగా వ్యవహరిస్తున్న రాఘవరెడ్డి తాను డీఈవోగా ఉన్నపుడు భారత్ స్కౌట్ విద్యాశాఖ కమిషన్ ఆదేశాల మేరకు 2024 జనవరి 4న ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చి జనవరి 6న నిర్వహించాలని నిర్ణయించారు. కానీ పలు మార్లు వాయిదాలు వేశారని.. ఎందుకు వేస్తున్నాం అనేది కూడా సమాచారం ఇవ్వకుండా ఫిబ్రవరి 2న నోటిఫికేషన్ ఇచ్చి 3న రాత్రిపూట 7గంటలకు సభ్యులతో ఎన్నికలు డీఈవో ఏకపక్షంగా నిర్ణయించారన్నారు. 230 మంది ఉన్న సభ్యుల సమక్షంలో నిర్వహించాల్సిన ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా నియంతగా వ్యవహరించారన్నారు.. దీనిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నాసర్‌జీ, రాజేంద్ర, రవి పాల్గొన్నారు.

దేశం విశ్వగురువుగా అవతరించడం ఖాయం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 29: యువత క్రియాశీలకంగా వ్యవహరిస్తే 2047 నాటికి భారతదేశం విశ్వగురువుగా అవత రించడం ఖాయమని వైవీయూ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ షావల్లిఖాన్ తెలిపారు. గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యువ సంవాద్ ఇండియా 2047 పేరుతో ప్రధాని మోదీ నిర్దే శించిన పంచ్‌ప్రాణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ వారసత్వ సంపద సంస్కృతీ గర్వించదగ్గవన్నారు. ప్రజలంతా ఐక్యంగా సార్వభౌమ అధికారం కలిగి ఎవరి బాధ్యతలు వారు నిర్వహించాలన్నారు. దేశాభివృద్ధికి అసమానతలు ఆటంకంగా నిలిచాయని, యువత వాటిని తరిమి కొట్టాలన్నారు. మంచి కోసం మాట్లాడుకోవాలని, యువ సంవాద్ చెబుతుందన్నారు. డీన్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి, రామక్రిష్ణమిషన్ కార్యదర్శి స్వామి అనుపమానంద, డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కన్వీనర్ డాక్టర్ కె.శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా


జాబ్‌ఫెస్ట్‌లో ఎంపికయిన విద్యార్థులు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 29 : కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో జాబ్‌మేళా జరిగిందన్నారు. కడప, మైదుకూరు, పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీకళాశాలల నుంచి 105 మంది విద్యార్థులు హాజరు కాగా 72 మంది ఎంపిక కావడం శుభపరిణామమని చెప్పారు. కార్యక్రమానికి ఉన్నత విద్య ఆర్‌జేడీ డాక్టర్ బాబు హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 29: కడప నగర పరిధిలోని ఫాతిమా వైద్యకళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను గురువారం నిర్వహించారు. 2018 బ్యాచ్ విద్యార్థులకు సంబంధించిన గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్, అనంతపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ డిగ్రీ సాధించిన ప్రతి విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. మాణిక్య రావు మాట్లాడుతూ ప్రతి వైద్యవిద్యార్థి సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల సెక్రటరీ జవాజ్ ఏక్యు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి వైద్యులుగా పేరు సంపాదించాలని కోరారు. ఫాతిమా కళాశాల చైర్మన్ సిద్దిఖీ, వైస్‌చైర్మన్ ఫారుఖీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు సల్మాన్‌ముర్తుజా, ప్రిన్సిపల్ డాక్టర్ శైలారేఖ, డైరెక్టరు డాక్టర్ మనోహర్‌రెడ్డి, విద్యార్థుల, తల్లిదండ్రులు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సారథ్యంలో దేశాభివృద్ధి

చక్రాయపేట, ఫిబ్రవరి 29: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశం దినదినాభివృద్ధి చెందుతోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బురుజుపల్లె, సురభి, నాగులగుట్టపల్లె, మహదేవపల్లె గ్రామాలలో బీజేపీ ప్రజాపోరాటయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, పులివెందుల అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వరరెడ్డి, వేంపల్లె, చక్రాయపేట బీజేపీ అధ్యక్షులు సుమన్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సయ్యద్ కరీముల్లా ఖాద్రి దర్గా ఉరుసు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 29 : కడప నగరంలోని ఆకుల వీధి మున్సిపల్ హైస్కూలు పక్కన వెలసిన సయ్యద్ కరీముల్లా ఖాదిరి సాబ్ బాబా దర్గా ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నేత ట్రాన్స్‌పార్మర్ శ్రీను పాల్గొన్నారు. వీరికి దర్గా నిర్వాహకులు సయ్యద్ కరీముల్లా స్వాగతం పలికి బాబా మజార్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహింపజేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 29 : యోగివేమన యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాల్లో ఎస్వీ డిగ్రీకళాశాల విద్యార్థి సుశీల్ కుమార్ 10కి 10 జీపీఏ సాధించినట్లు కరస్పాండెంట్ హరినారాయణ తెలిపారు. మూడో సెమిస్టర్ బీజెడ్‌సీలో రెహాన 9.79, షెబానా 9.44, ఎంఎస్‌సీఎస్‌లో సురేష్ 9.06 జీపీఏ సాధించారు. బీకాంలో సనా ఖనం 8.72, ధనశ్రీ 8.69, బీబీఏలో వినయ్ 8.40 జీపీఏ సాధించారు. 5వ సెమిస్టర్ బీజెడ్‌సీలో సౌమ్య 9.68, దీప్తి 9.20, ఆలియా 9.03, ఎంఎస్‌సీఎస్‌లో మహీన్ 9.05, బీకాంలో గంగా భవాని 8.11, లిఖిత 8.07, బీబీఏలో షమీయుల్లా 8.28, అతుర్ 7.97 జీపీఏ సాధించారు. వీరిని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు రామ్మోహన్, శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 29 : విద్యార్థినులు విద్య ద్వారా ఉజ్వల భవిత్తుకు బాటలు వేసుకోవాలని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామసుబ్బమ్మ తెలిపారు. గీతం నెక్సెస్ 2024 టు డే నేషనల్ లెవెల్ టెక్నాలజీ సింపోసియంలో భాగంగా గురువారం రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నృత్యం, గానం, షార్ట్ ఫిల్మ్, స్కిట్, స్టాండప్, ఫొటో గ్రఫీ, కామెడి అంశాలపై కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమాల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూషా, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ రావు, అధ్యాపకులు అభినందించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : భూపేశ్



మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 29: తాగునీటి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో, గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. వేసవి కాలం ప్రారంభానికి ముందే సమస్య తలెత్తడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రధానంగా మైలవరం , పెద్దముడియం మండలాల్లో నీటి సమస్యలు ఉన్నాయన్నారు. మైలవరం నుంచి రక్షిత నీటి పథకం సీపీడబ్ల్యూఎస్ ద్వారా 24 గ్రామాలకు నీరు అందించాల్సి ఉండగా కేవలం 10 గ్రామాలకు మాత్రమే అంతంతగా నీరు అందిస్తున్నారన్నారు. ఆయా గ్రామాల్లో పాడైపోయిన చేతి పంపులు, లీకేజీలను మరమ్మతులు చేయకుండా వదిలేశారన్నారు. అలాగే కొండాపురం మండలంలో సైతం కొన్ని చోట్ల నీటి సమస్యలు ఉన్నాయన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లగట్ల భూసిరెడ్డి, వెంకటేష్, సుబ్బరాజా, శంకర్, గంగరాజు, శ్రీనివాసపులు, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కొండాపురం మండల సమావేశం

కొండాపురం, ఫిబ్రవరి 29: మండల సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.మార్చి 3న పల్స్‌పోలియో ను విజయవంతం చేయాలని తాళ్ళప్రొద్దుటూరు పీహెచ్‌సీ డాక్టర్ రెహనా తెలిపారు. మండలంలో 5400 మంది రైతులకు పీఎంకిసాన్ క్రింద నిధులు విడుదలయ్యాయని కొండాపురం ఆర్‌బీకె ఇన్‌చార్జ్ అశోక్ తెలిపారు. మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాలు లేవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీచేయాలి

బద్వేలు, ఫిబ్రవరి 29 : ఎస్సీఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కేవీపీఎస్ పట్టణ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన పట్టణ మహాసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ద్వారా దళితవాడలో అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, సీఐటీయూ పట్టణ కో కన్వీనర్ కొండయ్య, ఐద్వా నాయకురాలు మోక్షమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లులు ఎందరొచ్చినా టీడీపీ జెండా ఎగురవేస్తాం





ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 29 : రాచమల్లులు లాంటి వారు ఎందరు వచ్చిన ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ను ఎగరేసితీరుతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ప్రవీన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎర్రన్న కొట్టాలలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు జబీవుల్లా, సీతారామిరెడ్డి, తాటిశ్రీను, బాబుల్‌రెడ్డి రాజుపాలెం మండల కన్వీనర్‌విశ్వనాథరెడ్డి, ఆవుల దస్తగిరి, పాణ్యం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే వ్యాపార రంగాన్ని ఆదుకుంటాం

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 29 : వైసీపీని ఇంటికి పంపి టీడీపీని అధికారంలోకి తెస్తే వ్యాపార రంగాన్ని ఆదుకుంటామని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం మైదుకూరు రోడ్డులోని వస్త్రభారతిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీ పీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, ఖలీల్, వస్త్రభారతి అధ్యక్షుడు మేరువ పెంచలయ్య, అనిల్, పల్లాశేషయ్య, చీమల రాఘవేంద్ర మండి మర్చంట్ అధ్యక్షుడు రోషన్ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎంగా అధికారం చేపడితే రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు, మహిళా సంక్షేమం, రైతాంగానికి మేలు చేకూరుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు పరిధిలోని తెలుగుగంగకాలనీ రోడ్డు, గాంధీనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలోభాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.33వ వార్డు కౌన్సిలర్ మిత్తికాయల సునీతయాదవ్, 25వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి శివమ్మ,జహంగీర్‌బాషా, సుబ్బరాయుడు, మూలె క్రిష్టారెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, సౌరమ్మ, లక్షుమ్మ, ఫక్కీరయ్య, సుభాన్‌బాషా, టంగుటూరు బ్రహ్మయ్య, మస్తానమ్మ, వినాయకమయ్య, రహీం, బెల్లు శ్రీనివాసులు, సుభాన్‌బీ, సిద్దయ్య, గాజులపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, కాల్వపల్లె వీరారెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఈ సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. గురువారం సాయంత్రం కవలకుంట్ల పంచాయతీ పరిధిలోని బుచ్చంపల్లె, వడ్డెపాలెం, దాసరిపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీభవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: మండల పరిధిలోని పి.వెంకటాపురంలో గురువారం టీడీపీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి, సతీమణి జ్యోతి బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నేతలు ఎం.మోహన్‌రెడ్డి, బ్రహ్మ నందరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, గోపాల్ యాదవ్, వీరారెడ్డి, నాగిరెడ్డి, దస్తగి రిరెడ్డి, నాగరాజుయాదవ్, గూటం నాగేంద్ర, వీరారెడ్డి, మల్లారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, పామిడి సత్యం, రాజగోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, జనసేననాయకుడు జగదీష్ పాల్గొన్నారు.





బద్వేలు, ఎర్రగుంట్లలో ప్రచారం చేస్తున్న బొజ్జ అరుణ, మాచుపల్లె లక్ష్మీదేవి, సరస్వతి,జ్యోతి తదితరులు

అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన జగన్

బద్వేలులో టీడీపీ జెండా ఎగురవేద్దాం ● యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి ● వైసీపీ నుంచి టీడీపీలోకి 30 కుటుంబాలు చేరిక

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 29 : అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాబోవు ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 7వ వార్డు అమ్మవారిశాల వీధిలో మాజీ కౌన్సిలర్లు ఎస్ఎం షరీఫ్, మహ్మద్ హసన్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలువారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వైసీపీ నుంచిటీడీపీలోకి ఎస్ఎం షరీఫ్, మహ్మద్‌హసన్, ఎస్‌ఎంబాషా, ఫరీక్‌బాషా, సుల్తాన్‌అహ్మద్, మహ్మద్ ఆసిఫ్, అల్లాబకాష్, మహ్మద్‌రఫి, ఫయాజ్, రియాజ్, అబ్దుల్‌కరీం తదితరులు వైసీపీ నుంచి టీడీపీలోకి 30 కుటుంబాలు చేరాయి. ఈ కార్యక్రమంలో బొజ్జ అరుణమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, భూపాల్‌రెడ్డి, కనుమర్లపూడి ప్రసాద్, మస్తాన్‌బాబు, జహంగీర్‌బాషా, బిగ్‌బాస్, హసన్, నరసింహనాయుడు, శివయ్యస్వామి, వెంకటసుబ్బయ్య, బాషా, హబీబున్నీసా తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 30 కుటుంబాల వారు

ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ భరద్వాజ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 29: ఎన్నికల సంఘం ఇచ్చిన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ట్రైనీ కలెక్టర్ భరద్వాజ సూచించారు. గురువారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని సభాభవనంలో ఎన్నికల సిబ్బంది విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో ఎక్కడైనా డబ్బులు, వస్తువులు కానీ పంపిణీ కానీ చేయడం సమస్యలుంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సిబ్బం ది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. త్వరలో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందన్నారు. డీఎస్పీ యశ్వంత్ మాట్లాడుతూ ఈసారి ఎన్నికలు టెక్నికల్‌గా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఒకే సిబ్బందికి రెండు చోట్ల సమస్యలు వస్తే ఒకరు ఒక వైపు, మరొకరు మరో వైపు వెళ్లి వెంటనే పరిశీలించి అక్కడ జరిగిన పరిస్థితులను వెంటనే రాసి పంపాలని అధికారులకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు, సిబ్బంది ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ధ్యానం అవసరం



ధ్యాన మందిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బద్వేలు, ఫిబ్రవరి 29: ప్రస్తుత ఉరుకుల ప్రపంచంలో ప్రతిఒక్కరికీ ధ్యానం ఎంతో అవసరమని బి.మఠం మండల పరిధిలోని అచలా నంద ఆశ్రమ అధ్యక్షుడు విరజానంద స్వామి పేర్కొన్నారు. గురువారం బద్వేలు పట్టణంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో యాదాళ్ల పీరయ్య బ్రదర్స్ కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించిన ధ్యాన మందిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయట్రస్ట్‌బోర్డు చైర్మన్,కమిటీసభ్యులు కేవీ.సుబ్బారావు, యాదాళ్ల నాగేశ్వరరావు, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 29 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి విమర్శించారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్ రెడ్డి, అఫ్సర్ బాషా, సుబ్బయ్య, సయ్యద్ బాషా, నరసింహకుమార్, రాజారెడ్డి, మల్లికార్జున, కొండారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి



పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 29 : పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్ఎస్ఏపీఓ అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 130 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి ఉచితంగా అందించారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్ తేజానందరెడ్డి, డాక్టర్ శ్రీరంజన్, రియాజ్, స్టాన్లీ, వినయ్ సహకారంతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశామన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ, హెచ్ఎం గుర్రప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొన్ని పోలింగ్ కేంద్రాలు మార్పు - ఆర్డీవో



జమ్మలమడుగు, ఫిబ్రవరి 29: జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలను మార్పు చేసినట్లు వాటిని పొలికల్ పార్టీ నేతల ప్రతినిధులు అనుమతిస్తే జిల్లా అధికారులకు పంపిస్తామని ఆర్డీవో శ్రీనివాసులు సూచించారు. గురువారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలోని చాంబర్‌లో పొలిటికల్ పార్టీ నేతల ప్రతినిధులకు ఎన్నికల పోలింగ్ బూత్‌లు ఓటర్ల జాబితాకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు ఇప్పటికే తమ సిబ్బంది, పోలీసు అధికారులు వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వాటినన్నింటినీ పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పోలింగ్ బూత్‌ల మార్పు, లోకేషన్ మార్పు గురించి తెలియజేశారు. కొండాపురం మండలంలో 2019లో గతంలో ఎన్నికలు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఆయా గ్రామాలు ఖాళీ కావడం, ఓటర్లు చాలా మంది బయటి ప్రాంతాల్లో చేరడం సమస్యలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను మార్పు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ పార్టీ నేతల ప్రతినిధులు సీతారాముడు, శంకర్‌రెడ్డి, నరసింహ, నారాయణరెడ్డి, పోచిరెడ్డి, వెంకటస్వామి, ముర్రిప్రకాశం, రెవెన్యూ అధికారులు మస్తాన్, రమణారెడ్డి, షఫి, రూపేష్, రవికుమార్, తహసీల్దారు కరుణాకర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి మార్చి 15వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షల కోసం పట్టణంలో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, భావన జూనియర్ కళాశాల, శ్రీదీప్తి జూనియర్ కళాశాల, అభ్యాస్ జూనియర్ కళాశాల, శ్రీవిద్య జూనియర్ కళాశాల, శ్రీషిరిడిసాయి జూనియర్ కళాశాల, శ్రీగీతం గర్ల్స్ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ గర్ల్స్ జూనియర్ కాలేజీ, ఎంఎస్ శారద జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉపాధి పనులు కల్పించాలి

కొండాపురం, ఫిబ్రవరి 29: మండలంలోని కొండాపురం, లావనూరు, పొట్టిపాడు, వెంకయ్యకాలువ, బెడుదూరు గ్రామాలలో ఉపాధిహామి క్రింద వెంటనే పనులు ప్రారంభించాలని సీపీఐ నాయకులు కోరారు.ఈ సందర్భంగా గురువారం వారు ఏపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి వైవి.సుదర్శన్‌రెడ్డి రంగనాథ్ ,కృపాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

కొండాపురం, ఫిబ్రవరి 29: ఆర్థిక అక్షరాస్యతపై కొండాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు.స్థానిక వివేకానంద పాఠశాలలో మేనేజర్ అన్వర్ విద్యార్థులకు బ్యాంకింగ్ కార్యకలపాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ బి.లింగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 29 : రక్తదానం ప్రాణదానంతో సమానమని వీరారెడ్డి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వీరారెడ్డి కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి ప్రశంసాపత్రం అందించారు.

పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోగలం

రాజుపాలెం, ఫిబ్రవరి 29 : విద్యార్థుల్లో కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజుపాలెం మండలంలోని వెల్లాలలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి క్రిష్టఫర్, కాలేజీ ప్రిన్సిపాల్ తులశమ్మ పాల్గొన్నారు.

లారీ అదుపు తప్పి బోల్తా

క్లీనర్‌కు గాయాలు

కొండాపురం,ఫిబ్రవరి 29: కడప-తాడిపత్రి పధాన రహదారిపై మండలంలోని దత్తాపురం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో గురువారం సాయంత్రం లారీ అదుపుతప్పి బోల్తా పడింది.కెమికల్ పౌడర్ లోడుతో వెళుతున్న ఈ లారీకి ఎదురుగా బస్సు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.ఈ సంఘటన లో లారీ క్లీనర్ కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన ను విచారిస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోపవరం, ఫిబ్రవరి 29 : మండల పరిధిలోని బద్వేలు - నెల్లూరు ప్రధాన రహదారిలో ఉన్న సెంచురీ పరిశ్రమ కేంద్రం వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలోబద్వేలుకు చెందిన వెంకటసుబ్బయ్య అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో వైద్యం కోసం బద్వేలు ప్రభుత్వఆసుపత్రికి బాధితున్ని తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ రవిశంకర్ దర్యాప్తు ప్రారంభించారు.

కొత్తగా నాలుగు స్కాట్ యూనిట్లు

చాపాడు, ఫిబ్రవరి 29: మండలంలోని నరహరిపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కొత్తగా నాలుగు స్కాట్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి పేర్కొన్నారు. ఇందులో రెండు బాలికల యూనిట్లు, రెండు బాలుర యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 50 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ స్కౌట్‌ను పండుగల రోజున దేవాలయాల్లోనూ, ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు వైద్య సిబ్బందికి తోడుగా సేవలు అందిస్తారన్నారు. 6, 7, 8 తరగతులకు చెందిన విద్యార్థులను స్కౌట్, గైడ్‌లుగా ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. స్కౌట్ రాష్ట్ర కార్యనిర్వాహక సహాయ కార్యదర్శి లక్ష్మీకర్, జిల్లా సెక్రటరి ప్రమీళ ఆధ్వర్యంలో ఈ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. వీరికి గైడ్స్‌గా ఉపాధ్యాయులు మురళీకృష్ణ, విజయ్‌కుమార్, గౌరీలత వ్యవహరిస్తారన్నారు.


భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 29: జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థంలో గురువారం బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఆలయం పునరుద్ధరణ చేసి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 9వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. ఆలయ కమిటీవారు ప్రసాదం పంపిణీ చేశారు.

పగిడాలలో వైసీపీ ప్రచారం

రాజుపాలెం, ఫిబ్రవరి 29 : మండల పరిధిలోని పగిడాల గ్రామంలో గురువారం వైసీపీకి చెందిన రాచమల్లు కిరణ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెలవలి నారాయణరెడ్డి, సర్పంచ్ గోవర్ధనరెడ్డి, రాజారాంరెడ్డి , రంగారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పెద్దమ్మతల్లి వార్షిక వేడుకలు



అశ్వవాహనంపై పెద్దమ్మతల్లి

మైదుకూరు, ఫిబ్రవరి 29 : పట్టణంలోని పాతూరులో 9 రోజులుగా నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి 25వ వార్షికోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. పెద్దమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో వేడుకలను ప్రతి రోజు అలంకరణలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. చివరి రోజు గురువారం భక్తులకు అన్న సంతర్పణ చేపట్టారు. అమ్మవారిని 9 అలంకారాలను ఏర్పాటు చేశారు.